క్లుప్తంగా

కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా కవిత



కేసముద్రం: కాంగ్రెస్ ఇనుగుర్తి మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఇనుగుర్తి గ్రామానికి చెందిన వర్రె కవిత నియమించినట్లు పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఇనుగుర్తిలో వర్రె కవితకు నియామక పత్రాన్ని ఆమె అందజేశారు.

వనభోజనాల సందడి



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణంలోని 17వ వార్డు పరిధిలో గల జగ్జీవన్ రాం, కేటీఆర్ కాలనీల వాసులు ఆదివారం వనభోజనాలకు తరలివెళ్లారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, డాక్టర్ సీతామహాలక్ష్మీ ముఖ్యఅతిథులుగా హాజరై వనభోజనాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ కౌన్సిలర్ యాళ్ల పుష్పలత, యాళ్ల మురళీధర్ రెడ్డి, ఎల్లయ్య, శివ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం సురక్షితం

పెద్దవంగర: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం సురక్షితంగా ఉందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో టిఫిన్ బైఠక్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలో ప్రతిభ



డోర్నకల్: స్థానిక భారత్‌వీర్ వ్యాయామశాల క్రీడాకారుడు గొర్రె దుర్గేశ్వర్‌రావు జాతీయ స్థాయి మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించాడు. విజయనగరం రాజవోని ఎంఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల జరిగిన పోటీలో పాల్గొన్న ఆయన స్కాడ్ 100 కేజీలు, బేంచ్‌ప్రెస్ 65 కేజీలు, డెడ్‌లిఫ్ట్ 115 కేజీలు కలిపి 230 కేజీల బరువు ఎత్తి రెండోస్థానంలో నిలిచి సిల్వ ర్ మెడల్ సాధించాడు. పోటీలో ప్రతిభ కనబర్చిన దుర్గేశ్వర్‌రావును భారత్‌వీర్ వ్యాయామశాల కోచ్ మండలోజు సుధాకర్, రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వి.మల్లేష్ అభినందించారు.

రోడ్డుపై చెత్త వేసి నిరసన

కురవి: మండలంలోని తట్టుపల్లి గ్రామంలో ఆదివారం యుపీఎస్‌లో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి, ఆ చెత్తను రోడ్డుపై వేసి యువకులు నిరసన తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తట్టుపల్లి పాఠశాలలో పిచ్చిమొక్కలు పెరగడంతో, ఎస్ఎంసీ చైర్మన్ సైదులు, బీజేపీ నేత భద్రసేనాగౌడ్, యువకులు కలిసి పిచ్చిమొక్కలను తొలగించారు. తొలగించిన పిచ్చిమొక్కలు, చెత్తను గ్రామపంచాయితీ ట్రాక్టర్‌లో వేసి బయటకు తరలించడానికిగాను సర్పంచ్‌కు ఫోన్ చేశారు. ట్రాక్టర్ పంపించాలని కోరగా, జీపీ కార్మికులు సమ్మెలో ఉన్నట్లు ఆయన తెలిపాడు. దీంతో ట్రాక్టర్‌ను పంపించకపోవడంతో తొలగించిన పిచ్చిమొక్కలను, చెత్తను స్కూల్ ఎదుట రోడ్డుపై వేసి వారు నిరసన తెలిపారు.

గుంతను పూడ్చాలి



గార్ల: గార్ల రైల్వేస్టేషన్ సమీపంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతను వెంటనే పూడ్చి ప్రమాదాలను నివారించాలని టీజేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గిన్నారపు మురళి జిల్లా డిమాండ్ చేశారు. ఆదివారం రహదారిపై ఉన్న కల్వర్టు గుంత ఎదుట ఆయన గంటపాటు బైటాయించి నిరసన తెలిపాడు.

రూల్స్ కఠినం

- రెగ్యులరైజేషన్ జీఓపై జేపీఎస్‌ల అసంతృప్తి
- చేసిన పనుల్లో టుబై థర్డ్ పాయింట్లు వస్తేనే రెగ్యులర్
- పనితీరు ప్రామాణికంపై ఆందోళన
- మదింపునకు కమిటీ



ఆందోళన చేస్తున్న జేపీఎస్‌లు (ఫైల్)

మహబూబాబాద్: జేపీఎస్‌లు ఆందోళనలతోపాటు చివరికి సమ్మెబాట పట్టగా ప్రభుత్వం దిగి వచ్చి రెగ్యులరైజేషన్ చేస్తామని హామీ ఇచ్చిన విషయం విధితమే. కాని రెగ్యులరైజేషన్ విషయంలో ప్రభుత్వం విధివిధానాలపై ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా జీఓను విడుదల చేసింది. ఆ జీఓ ప్రకారం పనితీరును ప్రామాణికంగా తీసుకోనున్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పరీక్షతో రాష్ట్ర వ్యాప్తంగా 9,355 మందికి మూడు సంవత్సరాల ప్రొబేషనరీ కాలంతో విధుల్లోకి తీసుకున్నారు. వారిలో మానుకోట జిల్లాలో 370, అవుట్ సోర్సింగ్‌లో 11 మంది పని చేస్తున్నారు. కాగా ఆ గడువు పూర్తి అయిన తర్వాత సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా మరో ఏడాది గడువు పెంచారు. వేతనం రూ.15,000 నుంచి 28,719 చేశారు. సీఎం హామీ ఇవ్వక ముందు జేపీఎస్‌లు రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిభారం తగ్గించాలని పలు డిమాండ్లతో ఆందోళన చేశారు.

రెగ్యులర్ చేసే విషయంలో మెలికే..

పని తీరును ప్రామాణికంగా తీసుకొని చేయాలని నిర్ణయం తీసుకోవడంతో జేపీఎస్‌లు ఆందోళన చెందుతున్నారు. వారి రెగ్యులర్ చేసే విషయంలో ప్రతి జిల్లాలో జిల్లా స్థాయి పనితీరు మూల్యాంకన కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆ కమిటీలో అదనపు కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఆ కమిటీలో అదనపు కలెక్టర్‌తోపాటు ఎస్పీ లేదా డీఎస్పీ, డీఎఫ్ఓ కమిటీ సభ్యులుగా ఉంటారు. వంద పాయింట్లతో మదింపు ప్రక్రియ జరగనుంది. దానిలో టు బై థర్డ్ పాయింట్‌లు వస్తేనే రెగ్యులర్ చేస్తారు. దాంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఆందోళన కలిగించే అంశాలు..

కోల్పోయిన సర్వీస్, డిప్యూటేషన్‌పై వెళ్లిన వారు. ట్రాక్టర్ ఈఎంఐ, సీసీ చార్జెస్, లాంటి ఆర్థిక అంశాలు, మెటర్నరీ లీవ్స్‌పై వెళ్లిన వారు, మూడు సంవత్సరాలు పూర్తైన జేపీఎస్‌లు వివిధ గ్రామాలలో ఓపీఎస్‌లపై ఏమీ స్పష్టత లేకపోవడం వంటి అంశాలు వారిని ఆందోళన గురి చేస్తున్నాయి. కొన్ని శాఖలలో పని చేసే కాంట్రాక్ట్ ఉద్యోగులను ఇతరత్రా ప్రక్రియ చేయకుండా రెగ్యులర్ చేశారు. ఓడీఎఫ్ ప్లేస్‌గా ఆదర్శ గ్రామాలుగా మర్చుటలో కీలక పాత్ర పోషించిన జేపీఎస్‌ల విషయంలో డైరెక్ట్ రెగ్యులర్ చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జేపీఎస్‌లకు న్యాయం చేయాలి



జేపీఎస్‌లకు న్యాయం చేయాలి. ఇతర కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వారికి ఏ పరీక్ష రాయకున్నా రెగ్యులర్ చేసింది. ప్రతి గ్రామంను, స్వచ్ఛ, ఆదర్శ గ్రామాలుగా అనేక అవార్డులు తీసుకొచ్చిన జేపీఎస్‌ల పట్ల ప్రభుత్వం కనికరించాలి. కోల్పోయిన సర్వీస్ కలపాలి.

– చుక్కల ప్రవీణ్, జేపీఎస్ జిల్లా అధ్యక్షుడు

ఆర్ఎంపీల సేవలు అమోఘం..

- ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

మరిపెడ: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉంటూ వారికి ప్రథమ చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడుతున్న ఆర్ఎంపీ, పీఎంపీ సేవలు అమోఘం అని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని నవీన్ గెస్ట్ హౌజ్‌లో డోర్నకల్ నియోజక వర్గంలోని సుమారు 400 మంది ఆర్ఎంపీ, పీఎంపీలతో ఎమ్మెల్యే ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లోని పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో ఆర్ఎంపీలు పాల్గొని ప్రజల మన్ననను అందుకోవడం గొప్ప విషయమన్నారు. కొందరు ఆర్ఎంపీలు ఎండీ, ఎంబీబీఎస్ స్థాయిలో వైద్య సేవలు అందించే వారు కూడా ఉన్నారు. తక్షణమే వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, సీఎం కేసీఆర్‌ల వద్దకు ఈనెల 23న వెళ్లి మీ విషయాన్ని వివరించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్, రామగుడు అచ్చుత్‌రావు, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్లు గుగులోతు సింధూర, ఎంపీపీ గుగులోతు అరుణ, జెడ్పీటీసీ తేజావత్ శారద, పీఏసీఎస్ చైర్మన్ చాపల యాదగిరిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

చిన్నగూడూరు: నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ వినూత్న పథకాలను ప్రవేశపెడుతున్నాడని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. శనివారం పలువురికి సీఎం ఆర్ఎఫ్ చెక్కులను ఉగ్గంపల్లిలో పంపిణీ చేశారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ఉద్యోగ ఉపాధ్యాయులకు శాపంగా మారిన నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా చాగంటి ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఆదివారం నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర ఈనెల 20న జిల్లాకు చేరుకుంటుందన్నారు. ఈనెల 18, 19వ తేదీలలో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రాలలో జరుగు బైక్ ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెవుల నాగార్జున, గుగులోత్ లాలు నాయక్, జిల్లా కార్యదర్శులు దేవ్‌సింగ్, మద్దెల వీరస్వామి, కడారి శ్రీనివాస్, తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగముని, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల అందజేత

దంతాలపల్లి: మండల కేంద్రానికి చెందిన అల్లం చంద్రశేఖర్ ఆదివారం మన ఊరు, మన భద్రతలో భాగంగా సుమారు రూ.10వేల విలువ చేసే 4సీసీ కెమెరాలను బహూకరించినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. ఏఎస్సై గోపిచంద్, సిబ్బంది గణేష్, ప్రకాష్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

వైద్యశిబిరం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రోటరీ క్లబ్ శాఖ ఆధ్వర్యంలో అక్యుప్రెషర్ మ్యాగ్నెటిక్ సుజోక్, వైబ్రేషన్ చికిత్స శిబిరాన్ని మార్వాడి సత్రంలో ఆదివారం ప్రారంభించారు. వైద్యశిబిరంలో జోదుపూర్‌కు చెంది డాక్టర్ సత్యనారాయణ చౌదరి, వారి బృందం చికిత్స అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాగేంద్రరావు, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా బాధ్యుడు సురేందర్ రెడ్డి, కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బేడ బుడిగ జంగాల అభివృద్ధికి కృషి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

తొర్రూరు: బేడ బుడిగ జంగాల సామాజికవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తొర్రూరు ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య ఆధ్వర్యంలో బేడబుడిగ జంగాల సంఘాల నాయకులు ఆదివారం హన్మకొండలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసారు. పలు సమస్యలపై మంత్రికి వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని అన్నారం రోడ్డులో బేడబుడిగ జంగాలకు ఫంక్షన్‌హాల్ కోసం 1.10ఎకరాలు కేటాయిస్తున్నామని, దాని నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేస్తామని మంత్రి హామీనిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, ఆర్‌బీఎస్ జిల్లా కమిటీ సభ్యులు రామసహాయం కిషోర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అర్జున్‌రాజు, నాయకులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

పెద్దవంగర: ఇటీవల అమెరికా పర్యటన విజయవంతంగా పూర్తి చేసుకొని వచ్చిన సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మండల బీఆర్ఎస్ నాయకులు ఆదివారం హన్మకొండలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో మండల నాయకులు బండారి వెంకన్న, దంతాలపెల్లి ఉపేందర్, రవి, జాటోతు వెంకన్న, ఎస్కే సైదులు, తదితరులు ఉన్నారు.

రైతుల కష్టం తెలిసిన పార్టీ కాంగ్రెస్



దంతాలపల్లి: మాట్లాడుతున్న మురళీనాయక్

దంతాలపల్లి: పేదల, రైతుల కష్టం తెలిసి వారి కన్నీళ్లు తుడిచిన పార్టీ కాంగ్రెస్ అని మహబూబాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మురళీనాయక్ అన్నారు. మండలంలోని బొడ్లాడ గ్రామంలో ఆదివారం ముఖ్య కార్యకర్తలు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ స్థానికులకే పెద్దపీట వేస్తుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎక్కడపడితే అక్కడ భూములు కబ్జ చేస్తున్నారని ఆరోపించారు. కుటుంబపాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మార్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. అనంతరం బొడ్లాడ గ్రామం మొదటి వార్డుసభ్యులు చిట్టి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు బ్లాక్ అధ్యక్షుడు నాయిని సత్యపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి లక్ష్మరెడ్డి, పీఏసీఎస్సీ డైరెక్టర్ బాలాజీ మాజీ సర్పంచ్‌లు మల్లేషం, సతీష్ రెడ్డి, నాయకులు గోగుల అశోక్, యూత్ అధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

గార్ల: ఇల్లందు నియోజకవర్గంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిష్ఠానం బీఫాం ఎవరికి ఇచ్చినా ఆ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం పార్టీలో వర్గ విభేదాలకు తావు లేకుండా అందరు కలిసి కట్టుగా పని చేసి గెలిపించుకోవాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎంపీటీసీ వెంకట్‌లాల్, వెంకట్‌రెడ్డి, శంషాద్‌బేగం, సుందర్, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

సమ్మెకు నాయకుల సంఘీభావం



గూడూరు: కార్మికులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



కేసముద్రం: ఇనుగుర్తిలో జీపీ కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న రాధ

గూడూరు: గ్రామ పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేసి, సమాన పనికి సమాన వేతనం అందజేయాలని మండల బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి చిట్టే వెంకన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సమ్మె శిబిరాన్ని ఆదివారం సందర్శించి మాట్లాడారు. అనంతరం కార్మికులకు పండ్లు పంపిణీ చేశాడు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధు, వార్డు సభ్యులు శివ పాల్గొన్నారు.

డోర్నకల్: జీపీ కార్మికుల సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో గాడెపల్లి వెంకటేష్, చిప్ప గణేష్, రజినికాంత్, తుమ్మల వీరన్న, ముదాకర్ పాల్గొన్నారు.

కేసముద్రం: జీపీ కార్మికులకు కాంగ్రెస్‌పార్టీ అండగా నిలిచి, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ అన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రంలో జీపీ కార్మికులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఆదివారం ఆమె సందర్శించి, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్, తోట వెంకన్న, గుజ్జునూరి బాబురావు, ప్రణయ్, ఇస్లావత్ చందు తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: బయ్యారంలో కాంగ్రెస్ పార్టీ ఇల్లందు నియోజకవర్గ నాయకుడు మంగీలాల్ జీపీ సిబ్బందికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను అడ్డుకున్న కార్మికులు



కూలీలను అడ్డుకున్న జీపీ కార్మికులు

కురవి: పక్క గ్రామాల నుంచి కూలీలను తీసుకువచ్చి ఆదివారం కురవి మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి పారిశుద్ధ్య పనులు చేయిస్తుండటంతో, సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు అడ్డుకున్నారు. ఇక్కడ మీరు పనులు చేయవద్దని బయటి నుంచి వచ్చిన కూలీలకు, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు మంజూర్‌అలీ, ఉపేంద్రాచారి తెలిపారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సమాచారం మేరకు ఎస్సై గోపి సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. కూలీలను అడ్డుకోవద్దని వారికి సూచించారు. అనంతరం జీపీ కార్మికులు దీక్షా స్థలం వద్దకు వెళ్లారు కార్యక్రమంలో రాంచంద్రయ్య, లచ్చయ్య, కృష్ణ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కూలీలను అడ్డుకున్న కార్మికులు

గార్ల: మండలంలోని ముల్కనూరు పంచాయతీలో అధికారులు బయట కూలీలను పెట్టుకొని పారిశుద్ధ్య పనులు చేయిస్తుండగా, ఆదివారం సమ్మెలో ఉన్న జీపీ కార్మికులు పనులను అడ్డుకొని కూలీలను ఇళ్లకు పంపించారు. వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు, గిరిప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

కేసముద్రం: నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ పట్టణ ఆర్గనైజింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంలో పాలకవర్గాలు పూర్తిగా విఫలమం అయ్యారని తెలిపాడు. కార్యక్రమంలో నాయకులు కాసు సాయిచరణ్, లక్ష్మీనర్సయ్య, బాలాచారి పాల్గొన్నారు.

భూమిని లాక్కోవాలని చూస్తున్నారు..



భూమి పత్రాలను చూపిస్తున్న పూల్‌సింగ్

నర్సింహులపేట: భూమిని లాక్కోవాలని చూస్తున్నారని బాధితుడు, డిఫెన్స్ ఉద్యోగి బానోతు పూల్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఆదివారం భూమి వద్ద ఆయన మాట్లాడుతూ.. వంతడపల శివారులో 33, 34 సర్వేనంబర్లలో 20 ఏళ్ల క్రితం 5.32ఎకరాలు కొనుగోలు చేసుకొని సాగు చేస్తున్నామన్నారు. ఇందులో కొంత భూమి తనకు ఉందని అధికార పార్టీకి చెందిన మండల నాయకుడు యాదగిరిరెడ్డి దౌర్జన్యం చేస్తున్నారని పూల్‌సింగ్ తెలిపాడు. భూమిలో పూర్తి అధారాలతో అయన విలేకరులకు చూపించారు. విశాఖ పట్టణంలో డిఫెన్స్ ఉద్యోగిగా పని చేస్తున్నానని, తను ఇక్కడికి రాకున్నా కేసు పెట్టారని, ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. అధికారులు త్వరగతిన పరిశీలించి ధరణిలో కొన్ని నంబర్లను సవరించాలన్నారు. తప్పు చేయనని, తప్పు తేలితే ఇక్కడనే చచ్చిపోతానని ఆవేదన వ్యక్తం చేశాడు.

సంక్షిప్త సమాచారం

మండల అభివృద్ధికి సహకరించాలి

తొర్రూరు: మండల అభివృద్ధికి స్థానికులు సహకరించాలని ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య అన్నారు. ఎంపీపీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ యువ నాయకులు ఆదివారం డివిజన్ కేంద్రంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. అన్నదానం, బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తూర్పాటి రవి, పేర్ల జంపన్న మండల కోఆప్షన్ సభ్యులు ఎస్కే అంకూస్, మడిపల్లి ఉప సర్పంచ్ నల్లూరి రామలింగం, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కేసముద్రం: ఇనుగుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కూరెల్లి సతీష్ ఇటీవల ఎన్నికయ్యాడు. ఈ మేరకు ఆదివారం మండలంలోని కోమటిపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు రావుల మల్లేశం, బానోతు ఈరు, రమావత్ కీమా, పాతతండా సర్పంచ్ బాలు పాల్గొన్నారు.

నివాళి

మరిపెడ రూరల్: మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన మొగిలి వెంకట్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పురుషోత్తమాయగూడెంలోని మొగిలి వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్, మహేందర్‌రెడ్డి, ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ శారద, మున్సిపాలిటీ చైర్మన్ సింధూర ఉన్నారు.

గ్రామాల్లో వైద్య సేవలు అందించాలి



నెక్కొండ సెంటర్: సీజనల్ వ్యాధులు ప్రభలనున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు విస్తృత పరిచి వైద్యం అందేలా చూడాలని పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సామ పాపయ్య, సీహెచ్ గణేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్య భవన్‌లో ఆదివారం పీవైఎల్ సమావేశంలో వారు మాట్లాడారు. టైఫాయిడ్, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రాణాంతకంగా మారుతాయని అట్టి వ్యాధుల నివారణకు అవగాహన కల్పిస్తూ, సౌకర్యాలను అన్ని సెంటర్లలో అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో సిబ్బంది, వైద్యుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. సమావేశంలో పీవైఎల్ జిల్లా నాయకులు పాలేపు వెంకటేష్, సురేష్, తెల్లబోయిన కృష్ణ, పెనిక భరత్, రాముడు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

తొర్రూరు: మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘ డివిజన్ అధ్యక్షుడు జలకం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని పాటిమీది ఆలయంలో మున్నూరు కాపు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈనెల 23న మున్నూరు కాపు డివిజన్ నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పు తిరుమలయ్య, ఆకుల పుల్లయ్య, కొమ్ము దేవేందర్, మూల చంద్రశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాషాయ జెండా ఎగరడం ఖాయం

నర్సింహులపేట: డోర్నకల్ నియోజకవర్గంలో రాబోయో ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయమని డోర్నకల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి అలయ ప్రాంగణంలో నిర్వహించిన బీజేపీ టిఫిన్ బైటక్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, గుగులోతు దేవిక, కాంతమ్మ, పూర్ణచందర్ పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత



కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన గంజి రమాదేవి అనే దివ్యాంగురాలికి హోప్ స్టెప్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వీల్‌చైర్‌ను అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు నాగవెల్లి శ్రీనివాస్, మాట్లాడుతూ.. వీల్‌చైర్ అవసరం ఉన్నవారు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీరామ్, రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

భర్తపై వేధింపుల కేసు నమోదు

గార్ల: మద్యానికి బానిసై భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న భర్తపై కేసు నమోదైన సంఘటన ఆదివారం పుల్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై బానోత్ వెంకన్న కథనం ప్రకారం సంఘటనకు సంబంధించిన వివరాలిలావున్నాయి. గార్ల మండలం పుల్లూరు గ్రామానికి చెందిన స్వరూపతో చెన్న రవీందర్‌కు 2011 సంవత్సరంలో వివాహం జరిగింది. వీరి దాంపత్య జీవితం 9సంవత్సరాలపాటు సజావుగానే సాగింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. కాగా గత కొన్నేళ్ల నుంచి భర్త ఆటో నడుపుకుంటూ మద్యానికి బానిసై భార్యపై అక్రమ సంబంధం అంటగడుతూ తరచూ శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడు. పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ చేసినా భర్తలో మార్పు రాలేదు. ఆదివారం పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ చేస్తుండగా భర్త రవీందర్ తన తండ్రి లక్ష్మయ్య, తమ్ముడు రాజేష్, తల్లి సుజాత లపై చేయి చేసుకున్నాడు. విసిగి వేసారిన భార్య స్వరూప భర్త రవీందర్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన ఎస్సై భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: పాత కక్షల కారణంగా ఒకరిపై పలువురు వ్యక్తులు దాడిచేసి గాయపర్చగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని మహబూబాబాద్ టౌన్ ఎస్సై వీ.దీపికరెడ్డి ఆదివారం తెలిపారు. పాత గొడవలు మనసులో పెట్టుకుని కురవి మండల కేంద్రంలో బండారి రమేష్, ఆయన కుమారుడు సాయిలు కురవి మండల కేంద్రానికి చెందిన బెల్లంకొండ సురేష్‌ను శనివారం సాయంత్రం కొట్టారు. ఆ వెంటనే సురేష్ మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చి అడ్మిట్ రాయించుకునేందుకుగాను క్యూలైన్‌లో నిలబడ్డాడు. అక్కడికి బండారి సాయిలు, రమేష్, దిలీప్, చింటు, కిరణ్, రాజేష్, మరికొంత మంది వచ్చి సురేష్‌ను ఆస్పత్రి నుంచి బయటకు తీసుకువచ్చారు. అసభ్యకర పదజాలంతో దూషిస్తూ అతడిపై దాడి చేసి గాయపరిచారు. జరిగిన సంఘటనపై బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి



మరిపెడ: మరిపెడ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మ గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని, దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు తల్లాడ వెంకట రామారావు అన్నారు. గాంధీ విగ్రహన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ ముందుగా మరిపెడ మండల కేంద్రంలోని అతిధి గృహం ఎదుట ఉన్న గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్యులు పాలాభిశకం చేశారు. అనంతరం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ ముందు 365 జాతీయ రహదారిపై ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వెంకట రామారావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పల నాగేశ్వర్‌రావు, ఉప్పల వెంకటేశ్వర్లు, సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, సురేష్, గోవర్ధన్‌రావు పాల్గొన్నారు.